క్లుప్తంగా

సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించండి



సమావేశమైన మహిళలు

కుంటాల: ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకొని సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించాలని సీసీ పెంటన్న అన్నారు. బుధవారం మండలంలోని పెంచికల్‌పాడ్‌లో గ్రామైఖ్య సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. వీవో అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి పల్లవి, వీవోఏ సంపత్, స్వ యం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ఖానాపూర్: చాలీచాలని వేతనంతో పని చేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం నెలకు రూ.8వేలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. భోజన పథకం నిర్వహణను హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు భాను, రాధ, లక్ష్మి, భీమక్క, కళ, రాజమణి, కవిత, మంగ, జ్యోతి, తస్లీమా, లతిక ఉన్నారు.

విద్యార్థులకు పోటీలు

మామడ: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని అన్ని పాఠశాలలలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. మత్తుపదార్థాలు–సమాజంపై వాటి ప్రభా వం అనే అంశంపై పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీలు నిర్వహించారు.

బోరుకు మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని నాలుగో వార్డు పరిధి శ్రీరాంనగర్ కాలనీలో తాగునీటి బోరుకు బుధవారం మరమ్మతులు నిర్వహించారు. బోరు మోటారు స్టార్టర్ చెడిపోవడంతో దాని స్థానంలో మున్సిపల్ సిబ్బంది నూతన స్టార్టర్ బిగించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. కౌన్సిలర్ నాయిని స్రవంతిసంతోష్, సిబ్బంది జావిద్ ఉన్నారు.

వరినాట్లు వేసిన విద్యార్థులు

పెంబి: క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా మండలంలోని మందపల్లి శ్రీ హర విద్యాలయ విద్యార్థులు బుధవారం పొలంబాట పట్టారు. గ్రామంలోని పొలాల వద్దకు వెళ్లి రైతులతో కలిసి నాట్లు వేశారు. వరి సాగు విధానాన్ని ఉపాధ్యాయులు.. విద్యార్థులకు వివరించారు. అనంతరం పొలాల్లో జాతీయ గీతాన్ని రైతులతో కలిసి ఆలపించారు. పాఠశాల యాజమాన్యం ఉల్లెందుల శంకర్ రమాదేవి, ఉపాధ్యాయులు సుమిత్ర, స్వాతి, లావణ్య, స్వప్న, సౌందర్య, శంకరమ్మ ఉన్నారు.

వైభవంగా వ్రతం

మామడ: మండలంలోని పొన్కల్ కొత్త చెరువు వద్ద బుధవారం వైభవంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. చెరువులో వరద పాయసం కలిపిన అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. పంట పొలాలకు చెరువు నీటిని విడుదల చేశారు. వీడీసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

'సీసీ' లేకుంటే జరిమానా..!

- నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- భైంసా పట్టణంలోని దుకాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు
- నోటీసులు జారీ చేస్తున్న పోలీసు శాఖ



నోటీసు ఇస్తున్న సీఐ రాజారెడ్డి, పక్కన ఏఎస్పీ(ఫైల్)



భైంసాలో ఓ దుకాణంలో సీసీ కెమెరా పరిశీలిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలో నేరాల నియంత్రణపై ఏఎస్పీ అవినాష్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రతి దుకాణ, వ్యాపార, వాణిజ్య సముదాయంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టారు. ఇటీవల పలు దుకాణాల్లో సీసీ కెమెరాలు పరిశీలించారు. చాలా చోట్ల దుకాణాల్లో సీసీ కెమెరాలు లేవు. కొన్నిచోట్ల ఉన్నా.. సరైన బ్యాకప్, కెమెరా స్పష్టత లేకపోవడాన్ని గుర్తించారు. దీంతో తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం ప్రతి దుకాణ సముదాయంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్పీ సూచించారు. సీసీ కెమెరాలు లేని దుకాణదారులకు నోటీసులు సైతం జారీ చేశారు. నోటీసు ఇచ్చిన గడువులోగా ఏర్పాటు చేసుకోకపోతే జరిమానా సైతం విధిస్తామని హెచ్చరించారు.

వందల సంఖ్యలో దుకాణాలు..

డివిజన్ కేంద్రమైన భైంసాలో వందల సంఖ్యలో దుకాణాలున్నాయి. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ (మేజర్) ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ ప్రకారం ఒక దుకాణానికి రోజుకు వంద మందికిపైగా వస్తుంటే.. సదరు దుకాణంలో తప్పనిసరిగా సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అంతేకాక సీసీ కెమెరాలు అధిక రిజల్యూషన్ కలిగినవి ఉండాలని.. 30రోజుల బ్యాకప్ ఉండేలా చూసుకోవాలని పేర్కొంటున్నారు. దీంతో ఏదైనా ఘటన, చోరీ జరిగినప్పుడు నేరస్తులను త్వరగా గుర్తించేందుకు వీలుంటుందని చెబుతున్నారు. పట్టణంలోని కొన్ని బడా దుకాణాలు మినహా చాలాచోట్ల సీసీ కెమెరాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కొన్ని పనిచేయకపోగా.. కొన్నిచోట్ల స్పష్టత లేనివి, బ్యాకప్ లేనివి ఉన్నట్లు గుర్తించారు.

ఏర్పాటు చేయకపోతే జరిమానా...

ఇటీవల పట్టణంలోని పలు దుకాణాలను ఏఎస్పీ అవినాష్‌కుమార్ పరిశీలించారు. సీసీ కెమెరాలు లేని దుకాణదారులకు ముందస్తు హెచ్చరికగా నోటీసులు జారీ చేశారు. ప్రతి దుకాణదారు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నోటీసు ఇచ్చిన 15రోజుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోతే రూ.5వేలు, నెలలోపు రూ.10వేల జరిమానా విధించనున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. అయినప్పటికీ ఏర్పాటు చేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరిస్తున్నారు.

> **దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి..**
>
> తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు ఉండాలి. పట్టణంలో సీసీ కెమెరాలు లేని పలు దుకాణదారులకు నోటీసులు జారీ చేశాం. గడువులోగా ఏర్పాటు చేసుకోకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. నేరాల నియంత్రణకు ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించాలి.
>
> – అవినాష్ కుమార్, ఏఎస్పీ, భైంసా

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించండి

లక్ష్మణచాంద: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి అశోక్‌వర్మ అన్నారు. బుధవారం మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూం టు రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ అందించిన తెలుగు వికాసం–1, తెలుగు వికాసం–2 పుస్తకాలను కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి విద్యార్థుల పఠన, లేఖనం, మౌఖిక అభివృద్ధి సాధించేందుకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూం టూ రీడ్ బ్లాక్ కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయుడు, సీఆర్పీ సుధాకర్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వడ్యాల్‌లో పుస్తకాలను అందిస్తున్న అశోక్‌వర్మ

సామర్థ్యాలు మెరుగుపర్చండి

మామడ: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని నోడల్ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. రూమ్ టూ రీడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొరిటికల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలుగు వికాసం–1, తెలుగు వికాసం–2 పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లిటరసీ ఫెసిలిటేటర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, పలువురు ఉపాధ్యాయులు పద్మ, శిరీష పాల్గొన్నారు.



కొరిటికల్ పాఠశాలలో..

చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

భైంసారూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎంఈవో సుభాష్ అన్నారు. బుధవారం మండలంలోని దేగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. 250 మంది విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు రూ.25 వేల విలువైన ఐడీ కార్డులు, టై, బెల్టులు, ఆడపిల్లలకు నేమ్ బ్యాడ్జీలు అందించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, వీడీసీ అధ్యక్షుడు టేకుల లింగన్న, ఉపాధ్యక్షులు సుభాష్, కోశాధికారులు సిందే లక్ష్మీకాంత్, బంటు వెంకటేశ్, మోహన్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కూర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం టై, బెల్ట్, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రణయశీల, సుజాత రూ.10 వేలకు పైగా వెచ్చించి విద్యార్థులకు అందజేశారు.



భైంసారూరల్: ఐడీకార్డులు ఇస్తున్న ఎంఈఓ

కడెం: మండలంలోని లింగాపూర్ జెడ్పీ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు, అదే పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వాల్గొట్ కిషన్ టై, బెల్ట్‌లు పంపిణీ చేశారు. రూ.10వేలు వెచ్చించి విద్యార్థులకు టై, బెల్టులు అందించినట్లు ఉపాధ్యాయుడు పేర్కొన్నారు. హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు భూమేశ్వర్, బాలాజీ, విశ్వనాథ్, శేషాద్రి, పోచయ్య, మహేశ్, శ్రీనివాస్ ఉన్నారు.



కడెం: టై, బెల్ట్‌లు పంపిణీ చేస్తున్న కిషన్

పరిశుభ్రతపై దృష్టి సారించండి

భైంసారూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా దృష్టి సారించాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హజ్గుల్, మాటేగాం, ఎగ్గాం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పారిశుధ్య పనులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించిన ఉచిత పుస్తకాలు, తరగతి గదులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఓలా ఉర్దూ మీడియం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట హెచ్‌ఎం రాహుల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి యోగేశ్, ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ యూనుస్ ఉన్నారు.



భైంసారూరల్: హజ్గుల్‌లో పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

బహుళజాతి గడ్డి విత్తనాలతో లాభాలు

సోన్: పాడి రైతులు బహుళజాతి గడ్డి విత్తనాలతో అధిక లాభాలు పొందవచ్చని డ్రీమ్ సంస్థ కోఆర్డినేటర్ చిన్నయ్య అన్నారు. బుధవారం మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన సత్యనారాయణ డెయిరీ ఫాంను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గడ్డి, పశుదాణాలో మార్పు తీసుకొస్తే పాల దిగుబడితోపాటు చిక్కదనం, వెన్న శాతం పెరిగి మార్కెట్లో మంచి ధర లభిస్తుందని రైతులకు వివరించారు. అనంతరం చాఫ్ కట్టర్ వినియోగించే తీరును వివరించారు. అనంతరం గడ్డి విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ శ్రీనివాస్, వీఏఓ గంగాధర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా బంద్

కుంటాల: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ మండలంలోని కల్లూర్‌లో బుధవారం స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వ్యాపార, వాణిజ్యసంస్థలు, వైద్యశాలలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు సహకరించారు. ఎస్సై రజనీకాంత్, ఏఎస్సై రాందాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

లోకేశ్వరం: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోలమాన్‌రాజ్, సూపరింటెండెంట్ వెంకట రమేశ్ తదితరులు ఉన్నారు.

బంగ్లాదేశ్‌లో దాడులను అరికట్టాలి


ఖానాపూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రితీష్ రాథోడ్ అన్నారు. దాడులను నిరసిస్తూ బుధవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. దాడులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంకం మహేందర్, నాయిని సంతోష్, టేకు ప్రకాశ్, పడాల రాజశేఖర్, బుచ్చన్న యాదవ్, డి.మల్లయ్య, రవీందర్‌రెడ్డి, సత్యవతి, శ్రావణ్, ఉపేందర్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాధ, రమేశ్, వెంకటేశ్, శ్రీధర్, లింబాద్రి, సాయి, స్వామి, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఆర్థిక సంఘం చైర్మన్‌ను కలిసిన నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: మొదటిసారి నిర్మల్‌కు వచ్చిన రాష్ట్ర ఆర్థికసంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను బుధవారం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. సారంగాపూర్ మార్కెట్ మాజీ చైర్మన్ దశరథ్ రాజేశ్వర్, సారంగాపూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాక్‌పెల్లి సురేందర్, ఉట్ల రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు మధుకర్, దశరథ నిఖిల్, మోహిన్, భోజగౌడ్, సాయికృష్ణ గౌడ్, ఎస్‌కె సలీం, ముక్తార్, షేక్ షఫీ, గుర్రాల రాజు తదితరులు ఉన్నారు.



రాజయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతలు

దెబ్బతింటున్న రోడ్డును పట్టించుకోరూ..



రాచాపూర్ సమీపంలో ధ్వంసమైన రోడ్డు



భారీ వాహనాలకు కుంగిన రోడ్డు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ నుంచి మూటాపూర్ వెళ్లే ప్రధాన రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతింటుంది. కొందరు రాచాపూర్ సమీపంలోని గుట్ట ప్రాంతం నుంచి అనుమతుల్లేకుండా నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాల్లో నిర్మల్‌కు మొరం తరలిస్తూ లక్షల రూపాయల ప్రజాధనం కొల్లగొడుతున్నారు. రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు ఐదారు చోట్ల ప్రమాదకరంగా మారింది. వాహనదారులు సైతం ఇబ్బందుల నడుమ ప్రయాణం సాగిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు ధ్వంసం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

తక్కువ ప్రీమియంతో అధిక లాభాలు

తానూరు: తపాలాశాఖలో తక్కువ ప్రీమియం చెల్లించి అధిక లాభాలు పొందవచ్చని భైంసా సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో తపాలాశాఖ అందిస్తున్న పొదుపు, బీమా పథకాలు, వడ్డీ రేట్లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలాశాఖ ద్వారా ప్రతి గ్రామంలో డ్యాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(డీసీడీపీ) పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్‌లోని ఏఈపీఎస్, జీఏజీ, పాలసీలు, డీఎల్‌సీసీ (డిజిటల్ లైవ్ సర్టిఫికెట్) గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది కల్యాణ్, గోవింద్‌పటేల్, మాజీ సర్పంచ్ మాధవ్‌రావ్, నాయకులు శివాజీ పటేల్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

వేధిస్తే 100కు డయల్ చేయండి

నిర్మల్‌టౌన్: ఎవరైనా వేధిస్తే ఆందోళన చెందకుండా డయల్ 100కు ఫోన్ చేయాలని షీటీం ఎస్సై ఫర్‌సీస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీం బృందం ఆధ్వర్యంలో 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆపదలో షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 8712659550 కు ఫోన్ చేయాలని సూచించారు. జ్యోతి, కౌన్సిలర్ స్వప్న, ఏఎస్ఎం రాధిక, కవిత, షీటీం సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

ఇంటింటా జాతీయజెండా ఎగురవేయాలి

భైంసాటౌన్: జాతీయ సమైక్యత చాటేలా ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటా జాతీయ జెండా ఎగరవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.మోహన్‌రావు పటేల్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని దారాబ్జి ఫ్యాక్టరీలో జాతీయ జెండాలు పంపిణీ చేశారు. మార్కెట్ ప్రాంతంలో తిరుగుతూ జెండాలు అందజేశారు. ప్రతి పౌరుడు దేశ సమైక్యతను కాపాడాలని కోరారు. బీజేపీ నాయకులు, తదితరులున్నారు.

లోకేశ్వరం: దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఇంటింటా జాతీయజెండా ఎగురవేయాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం సాథ్‌గాం గ్రామంలో బీజేపీ నాయకుడు సాయినాథ్ పటేల్ ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు.



భైంసాలో జెండాలు అందిస్తున్న మోహన్‌రావు

బాధిత కుటుంబానికి పరామర్శ

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోట సాయన్న మాతృమూర్తి గంగవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సాయన్న కుటుంబసభ్యులను పరామర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, నాలం శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, రాందాస్, మాజీ సర్పంచ్‌లు వెంకాయి శ్రీనివాస్‌రెడ్డి, రొడ్డ రాజేశ్వర్, బండి లింగన్న, వినోద్‌కుమార్, మలయ్య, మల్లేశ్, భూమేశ్, నర్సింగ్‌రావు, నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి కాస ప్రవీణ్ ఇటీవల మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. నాయకులు దశరథ రాజేశ్వర్, రాజలింగం, చంద్రశేఖర్ తదితరులున్నారు.



న్యూవెల్మల్‌లో పరామర్శిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

నియామకపత్రం అందజేత

లోకేశ్వరం: మండలంలోని హథ్‌గాం గ్రామానికి చెందిన జోడేదండే వికాస్ బుధవారం హైదరాబాద్‌లో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌గా నియమితులై చైర్మన్ విజయ్‌కుమార్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరంగా ప్రజలకు ఎదురయ్యే సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా వెంటనే 8309328606 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.



వికాస్‌కు నియామకపత్రం ఇస్తున్న విజయ్‌కుమార్

30 పోలీస్ యాక్ట్ ఉల్లంఘనపై కేసు

నిర్మల్ టౌన్: 30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘించిన దిలావర్‌పూర్ గ్రామస్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దిలావర్‌పూర్ గ్రామస్తులు వారి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయానికి గుంపుగా వచ్చి ముందస్తు అనుమతి లేకుండా గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారికి పోలీసులు నచ్చజెప్పినా వినకుండా కార్యాలయంలోకి వెళ్లే ఉద్యోగుల విధులు, సామాన్య ప్రజలకు ఆటంకం కలిగించారు. ఇలా అనుమతి లేకుండా ధర్నా నిర్వహించి ఉద్యోగుల విధులు, ప్రజలకు ఆటంకం కలిగించినందుకు అనిల్‌కుమార్, వీరేశ్, సాయన్నతో పాటు కార్యాలయానికి పలువురిని తీసుకువచ్చిన 20 ఆటోలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు నిర్వహించరాదని తెలిపారు.